ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 12, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 19, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు 28న ఎంట్రెన్స్ టెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 28న ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి సోమవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టీజీ ఐసెట్–2024 అర్హత గల అభ్యర్థులు నేరుగా అడ్మిషన్స్ పొంద వచ్చు అన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్ సైట్ చూడవచ్చు.

ఆహారం అందజేసిన చిన్నారులు



సనత్‌నగర్: మోడల్‌కాలనీ కమాన్ వద్ద మానవ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మిత ఆహార పంపిణీ కార్యక్రమంలో సోమవారం చిన్నారులు తమవంతు భాగస్వామ్యం వహించి స్ఫూర్తిగా నిలిచారు. బాటసారులకు ఆహారం అందించే క్రమంలో ప్రతిరోజూ వండే వంటకాలను తల్లిదండ్రులతో కలిసి కేంద్రంవద్ద తామే వడ్డించడం గమనార్హం. ఇందుకు సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి దిక్సూచి అయ్యింది. మెనూలో భాగంగా చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి టమాటో రైస్, కూర, పెరుగన్నం తయారుచేసుకుని వచ్చి వాళ్లే వడ్డించారు. చిన్నారులకు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా చేయాలనే ఉద్దేశ్యంతో వారిని ప్రోత్సహిస్తున్నట్లు సనాతన ధర్మ బల సంస్కరణ సమితి ప్రతినిధి దండా బుచ్చిబాబు తెలిపారు.

వాటా తేల్చాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి



బొల్లేపల్లి స్వామిగౌడ్‌–ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల రిజర్వేషన్ల వాటా తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ కులగణన అనంతరం బీసీ జనాభా లెక్కల దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు బీసీ రిజర్వేషన్ల వాటాను ఇవ్వాలన్నారు. లేని పక్షంలో బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్లు హెచ్చరించారు.

బీజేపీ నేతల సమావేశం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: డివిజన్‌లోని వెంకట్‌నగర్‌లో సోమవారం భారతీయ జనతా పార్టీ ముఖ్యనాయకుల సమావేశం డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నిక విషయంపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు శారద మల్లేష్, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణ, నర్సింగ్‌రావు, రాజారాం, హంసరాజు, దిలీప్, రాజు, శ్రావణ్, ప్రసాద్, శ్రీకాంత్, మోహన్, మహేష్ పాల్గొన్నారు.

నీరే జీవనాధారం

సాక్షి, సిటీబ్యూరో: అనేక రకాల ఆరోగ్య, ఆరోగ్యేతర అంశాలలో నీటి పాత్ర కీలకమని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అయాన్ ఎక్స్ఛేంజ్ ది మోడ్రన్ లివింగ్ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో హైడ్రోనెక్సట్ 2025 పేరిట సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.దినేష్ కుమార్ (ఐసీఎంఆర్–ఎన్ఐఎన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ) నీటి పొదుపు అవసరాన్ని నొక్కి చెప్పారు. డాక్టర్ ఎస్.శ్రీధర్ (ఐఐసీటీ), డాక్టర్ మనోజ్ కురియకోస్ నీటి హీలింగ్ ఎనర్జీని హైలైట్ చేశారు. సర్టిఫైడ్ హైడ్రోజన్ అడ్వైజర్ శ్రీనివాసులు హైడ్రోజన్ నీటి ప్రయోజనాలను వివరించారు.

వద్దంటున్నా.. దూసుకుపోతున్నారు..



ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న మైనర్లు



ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలు.. (ఫైల్)

సనత్‌నగర్: నగర రోడ్లపై మైనర్లు రయ్ రయ్ అంటూ దూసుకుపోతున్నారు. మైనర్లు పట్టుబడ్డ సమయంలో బేగంపేటలోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌తో పాటు పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్రతినిత్యం నమోదవుతున్న కేసులే ఇందుకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తున్నాయి.

- ఈ ఏడాది నార్త్‌జోన్ ఏసీపీ పరిధిలో 124 కేసులు
- 81 మందికి రూ.1,57,700 జరిమానా
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపిన వారు 774 మంది

- డ్రైవింగ్ బాగానే చేస్తున్నారు కదా.. పర్వాలేదు అన్న ధోరణితో తల్లిదండ్రులు సైతం ప్రోత్సహిస్తుండడం మూలంగా తరచూ మైనర్లు పట్టుబడుతూనే ఉన్నారు. దీంతో మైనర్లతో పాటు వాహన యజమానులపై చర్యలు తీసుకుంటున్నారు. కేసులు నమోదు చేసిన సమయంలో చాలామంది ట్రాఫిక్ పోలీసులపై విరుచుకుపడిపోతుంటారు. కానీ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్న నిబంధనను మాత్రం మరిచిపోతున్నారు.
- కొందరు ఇక్కడే కదా? వెళ్లొచ్చేస్తాం అని ఇంట్లో చెప్పి వెళ్తుంటే..మరికొందరు ఇంట్లో చెప్పకుండా ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్తూ పట్టుబడుతున్నారు.
- మైనర్లను జువైనల్ కోర్టుకు, వాహన యజమానులను సాధారణ కోర్టుకు పంపిస్తున్నారు. అనంతరం ఇద్దరికీ కలిపి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పలు ప్రమాదాలకు గురవుతున్న సందర్భాలు అనేకం చోటుచేసుకున్నాయి.
- పలు ఘటనల్లో తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చిన ఘటనలను తెలియజేస్తూ చైతన్యం తీసుకువస్తున్నా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతూనే ఉన్నారు.
- ఆ ఏముంది..మహా అయితే ఫైన్ వేస్తారు..అంతే కదా? అన్న పరిస్థితికి మైనర్లు, వారి తల్లిదండ్రులు వచ్చేశారు. ఏకంగా పాఠశాలలకు కూడా ద్విచక్ర వాహనాలను డ్రైవింగ్ చేసుకుంటూ వస్తున్నా పాఠశాలల యాజమాన్యాలు కూడా పట్టించుకోవడం లేదు. అటు తల్లిదండ్రులకు లేని అభ్యంతరం..తమకేంటి అన్నట్లుగా వారు వదిలేస్తున్నారు.
- ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటివరకు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలోని బేగంపేట, మహంకాళి, గోపాలపురం, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్లలో 124 కేసులు నమోదు కాగా, ఇందులో 81 మందిని కోర్టులో హాజరుపర్చారు.
- కోర్టు ఆదేశాల మేరకు మొత్తం రూ.1,57,700ల జరిమానాల రూపంలో చెల్లించారు. మరో 79 మంది కోర్టు ఆర్డర్స్ మేరకు సామాజిక సేవ చేశారు.

జనవరి 1 నుంచి మార్చి 22 వరకు నమోదైన కేసుల వివరాలు..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై కేసులు	మైనర్ డ్రైవింగ్ కేసులు..
బేగంపేట	208	22
మహంకాళి	122	15
గోపాలపురం	97	16
మారేడ్‌పల్లి	68	6
తిరుమలగిరి	101	37
బోయిన్‌పల్లి	178	28

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా 774 మంది

డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) లేకుండా వాహనాలు నడిపిన వారిపై ఈ ఏడాది ఇప్పటివరకు 774 కేసులు నమోదయ్యాయి. ఇందులో 620 మందిని కోర్టులో హాజరుపరచగా, రూ.6,91,151లు జరిమానాల రూపంలో చెల్లించారు.

- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని పదే పదే ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆరు పోలీస్ స్టేషన్ల పరిధి లో ఈ ఏడాది జనవరి 1 నుంచి కేవలం 82 రోజుల్లోనే 774 మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారంటే ఏ మేరలో చైతన్యవంతులు అయ్యారో అర్థమవుతోంది.
- ఏదైనా ప్రమాదానికి గురైతే డ్రైవింగ్ లైసెన్స్ లేనిదే రావాల్సిన పరిహారాలు కూడా రావని ట్రాఫిక్ పోలీసులు స్పష్టంగా చెబుతున్నారు.

మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించకూడదు

మైనర్ డ్రైవింగ్ విషయంలో తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు కూడా నిక్కచ్చిగా వ్యవహరించాలి. వాహనం నడపడం వచ్చినా కూడా నిబంధనల మేరకు నడుచుకోవాల్సిందే. మైనారిటీ తీరిన అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాత మాత్రమే వాహనం నడపాలి. మైనర్‌లకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తున్నాం.
– శంకర్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ, నార్త్‌జోన్

ఆ బస్తీవాసుల గోస తీర్చండి

ప్రభుత్వాన్ని కోరిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలోని రక్షణ, సివిల్ ఏవియేషన్ స్థలాల్లో నివాసముంటున్న వేలాది మందికి భూబదలాయింపు ప్రక్రియ ద్వారా పట్టాలు ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు. అసెంబ్లీలో మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోని రక్షణ, సివిల్ ఏవియేషన్ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి కనీస సదుపాయాలు కూడా అందడం లేదన్నారు. సుమారు 11వేలకు పైగా కుటుంబాలు ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలు తీరుతాయని వారు ఆశించారని కానీ, గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ వారిని పట్టించుకోలేదన్నారు. కంటోన్మెంట్ సైతం వారికి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. రక్షణశాఖ భూముల్లో ఉన్న సాయిబాబా హట్స్, చిన్న కమేలా, నందమూరి నగర్, మర్డ్ ఫోర్డ్ హట్స్,108 బజార్, సెంట్రల్ బాటరీ, రెడ్డి కంపౌండ్, సివిల్ ఏవియేషన్ లాండ్ లో ఉన్న అన్నానగర్, రసూల్ పుర, ఇందిరమ్మ నగర్, శ్రీలంక బస్తీలలో కనీస మౌలిక వసతులు కూడా లేవన్నారు. ముఖ్యంగా కొన్ని బస్తీలలో మహిళలు కాలకృత్యాలకు కూడా తమ ఆత్మగౌరవాన్ని చంపుకొని బయటికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించి వారి సమస్యలకు ఒక పరిష్కారం చూపాలని కోరారు. ఈ భూములను కేంద్ర ప్రభుత్వంతో బదాలాయించుకొని ఆ పేదల సొంత ఇంటి కలను నేరవేర్చాలని కోరారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే టీబీ నియంత్రణ సులభం



గాంధీలో క్షయవ్యాధి అవగాహన ర్యాలీ దృశ్యం

గాంధీఆస్పత్రి: ప్రాథమిక దశలో గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందిస్తే క్షయవ్యాధి నియంత్రణ సులభమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర సూచించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీ మైక్రోబయోలజీ విభాగ ఆధ్వర్యంలో సోమవారం చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయవ్యాధి పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో టీబీ నివారణ మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, గాంధీ ఆస్పత్రిలో టీబీ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ప్రాంగణాల్లో ర్యాలీ నిర్వహించి క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి, మైక్రోబయోలజీ వైద్యులు సురేఖ, పూజ, స్వాతి, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్‌గౌడ్, ఫారూఖ్, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు: ఎమ్మెల్యే తలసాని



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చూపవద్దని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్, మోండా, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 2.94 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని కోరారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నేతలు కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, నాగులు, మహేష్‌యాదవ్, లక్ష్మీపతి, వెంకట్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కారం



ప్రజల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో తాగునీరు, మురుగునీటి సమస్యలకు సత్వర పరిష్కారమార్గం చూపుతామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ హామీ ఇచ్చారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, మేడిబావి, రామాలయం, కిందిబస్తీ ప్రాంతాల్లో సర్యటించిన ఆమె స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి ఎండలు సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో వాతావరణ అంచనా



సదస్సులో మాట్లాడుతున్న హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న



సదస్సుకు హాజరైన టీచర్లు, విద్యార్థులు

సనత్‌నగర్: ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికల విషయంలో ఉన్న అంతరాన్ని తగ్గించుకుంటూ వెళ్తున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న అన్నారు. ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేటలోని వాతావరణ కేంద్రంలో సోమవారం 'క్లోజింగ్ ది ఎర్లీ వార్నింగ్ గ్యాప్ టుగెదర్' అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎర్లీ వార్నింగ్ సిస్టం అమలు చేయడంలో వాతావరణ శాఖ ప్రధాన భూమిక పోషిస్తోందన్నారు. వాతావరణ శాఖ నుంచి అందే హెచ్చరికలను ప్రభుత్వాలకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు త్వరితగతిన అందేలా ప్రస్తుత కమ్యూనికేషన్ వ్యవస్థ బలంగా ఉందన్నారు. దీని ద్వారా జరిగే నష్టాన్ని భారీగా తగ్గించడమో, లేక అసలు లేకుండా చేయడమో జరుగుతుందన్నారు. ఎన్ఆర్ఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

బంజారాహిల్స్: అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు మినిష్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం కన్వీనర్ జెట్టి విజయ్‌కుమార్ మాట్లాడుతూ... అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల హామీ అంశాన్ని ప్రస్తావించాలని నేతలు కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలాన్ని ఇస్తామని మాటిచ్చారని ఈ సందర్భంగా మంత్రికి గుర్తు చేశారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి



స్వరూప దంపతులకు వీడ్కోలు పలుకుతున్న సహోద్యోగులు

అడ్డగుట్ట: ఉద్యోగులు అంకిత భావం, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ చంద్రప్రకాష్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ మైదానం ఆవరణలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ఈ నెలాఖరులో పదవీ విరమణ పొందుతున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్ కే. స్వరూప, రవికుమార్‌లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన చంద్రప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీ తనంతో పని చేయాల, పనిపట్ల శ్రద్ధ, నిబద్ధత ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ మీడియా కోఆర్డినేటర్ షేక్ రవూఫ్, మదన్ మోహన్, ఎ.జి.కే. మూర్తి, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ నాయకులు గత ఎన్నికల్లో విద్యార్థులకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు ఇచ్చిన హామీలను.. అధికారం చేపట్టాగానే విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ అన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీలో నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా వామ పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించారని నిషేధాజ్ఞలతో ఉద్యమాలను ఆపలేరని జాన్ వెస్లీ పేర్కొన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, ప్రొ.హరగోపాల్, పౌర హక్కుల సంఘం నేత ప్రొ.గడ్డం లక్ష్మణ్ ప్రసంగించారు.

బీసీలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ నాయకులకు బీజేపీ రాష్ట్ర పదవి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల లింగం గౌడ్ సోమవారం డిమాండ్ చేశారు. బీసీలను తెలంగాణ సీఎంను చేస్తామని ప్రకటించిన బీజేపీ అగ్రనేతలు రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ను తొలగించి అగ్రకులానికి చెందిన కిషన్‌రెడ్డికి మరో సారి అధ్యక్ష పదవిని కట్టబెట్టడం దారుణమన్నారు సామాజిక న్యాయం కోసం జనాభాలో అధిక శాతం ఉనన బీసీలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి నేతలు బుర శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు జారీ చేసిన నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను వెనకు తీసుకోవాలని బహుజన విద్యార్థి సంఘాలు, డి–జాక్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం లా కాలేజీ ఎదుట గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నేతల వేల్పుల సంజయ్, డి–జాక్ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతు ఓయూలో విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధించడం అప్రజాస్వామికమన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలని వీసీ ప్రొ.కుమార్‌ను డిమాండ్ చేశారు.

బండి సంజయ్ పై ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు

ఉస్మానియా యూనివర్సిటీ: మాజీ సీఎం కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్‌వీ నాయకులు సోమవారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రవంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బండి సంజయ్‌ని మంత్రి పదవీ నుంచి బర్తరఫ్ చేసి, పార్టీ నుంచి తొలగించాలని విద్యార్థి నేతలు చటారి దశరథ్, జంగయ్య పేర్కొన్నారు.

మహిళను వేధిస్తున్న బావపై కేసు నమోదు

సనత్‌నగర్: మహిళను వేధిస్తున్న ఆమె బావపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరీష్ తెలిపిన మేరకు.. బోరబండ ప్రాంతానికి చెందిన మహిళ (31) జీహెచ్ఎంసీలో ఉద్యోగం చేస్తోంది. 2020లో ఆమెకు వివాహం కాగా ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భర్త, అత్తామామలు, బావ సంజీవ్‌కుమార్ (39)కుటుంబంతో కలిసి ఉమ్మడిగా ఉంటున్నారు. కొంతకాలంగా సదరు మహిళను బావ సంజీవ్‌కుమార్ వేధించడం మొదలుపెట్టాడు. ఈ నెల 22వ తేదీన బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా వచ్చి చేయి పట్టుకున్నాడు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రుల సహకారంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు సంజీవ్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మహంకాళి పోలీసులు స్వాధీనం చేసికున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఎంజీ రోడ్డులోని గ్లోబల్ బేరింగ్స్ షాపు ముందు గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడివున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

నిందితులను అరెస్టు చేయాలి

రాంగోపాల్‌పేట్: ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై లైంగిక దాడికి యత్నించిన నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, పాల్వాయి హరీష్, రామారావులు విమర్శించారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిని ఎమ్మెల్యేలు పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇంత దారుణం జరిగినా నిందితుడిని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. బాధితురాలికి బీజేపీ అండగా ఉంటుందన్నారు.